# బిర్యానీ

## మడపల్లి రమేష్‌రాజు

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) సంయుక్తంగా నిర్వహించిన కథానిక (1997) పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ)

"బాబా! కోడి బిరియానీ ఎప్పుడెడతారు?"

తండ్రి సింహాచలం భుజమ్మీద స్వారీ చేస్తూ, చేతిలో జెండా పట్టుకుని, ఓ రాజకీయ పార్టీ ఊరేగింపులో వెళుతున్న అయిదేళ్ళ రాములు తండ్రిని అడిగాడు.

"జులుస్ అంబేద్కర్ బొమ్మ దగ్గరికి చేరినాక ఎడతారని కాంట్రాక్టర్ సెప్పిండు" కొడుకును సముదాయిస్తూ జవాబిచ్చాడు సింహాచలం.

అది హైదరాబాద్‌లో మే నెల మిట్టమధ్యాహ్నం. హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్‌మీద జులుస్ సాగుతోంది. చుట్టుపక్కల గ్రామాలలో సూర్యుడు పొడవకముందే, లారీలలో బయలుదేరి, నగరం చేరుకున్న పిల్లా పెద్దా, ఆడమగా, అంతా చేతుల్లో పార్టీ జండాలు పట్టుకుని, రెండు బార్లుగా తీరి, సాగుతున్నారు. జులుస్ నిర్వహిస్తున్న కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో, రెండు బారుల నడుమా నడుస్తూ, నినాదాలిస్తున్నారు. పిచ్చి పేర్లులాగా చేతులూ కాళ్ళూ ఎగరేస్తున్నారు. విజయోత్సాహంతో ఊగిపోతున్నారు. బార్లు తీరి నడుస్తున్న జనంలో, ప్రారంభంలో వున్న ఉత్సాహం సన్నగిలుతోంది. మే నెల మిట్టమధ్యాహ్నం ఎండ తట్టుకోలేక, చేతుల్లోని జండాల నీడల్లో మొహాలు చాటుచేసుకుంటున్నారు. చెప్పులు లేని పాదాల్ని, వేడెక్కిన తారురోడ్డుమీద ఆనలేక, అడుగులు నడినడిగా వేస్తున్నారు, ఒకర్నొకరు తోసుకుంటున్నారు.

జులుస్ సాగుతోంది.

"బాబా! ఈ జులుస్ దేనికి?" హటాత్తుగా అడిగాడు రాములు తండ్రిని.

"తెల్వద్" ముక్తసరిగా జవాబు చెప్పేడు తండ్రి సింహాచలం కొడుకుని ఓ భుజం మీంచి మరో భుజం మీదికి మార్చుకుంటూ.

తండ్రి సమాధానం రుచించలేదు రాములుకి. జాగ్రత్తగా కార్యకర్తలు చేస్తున్న నినాదాలు వినడానికి ప్రయత్నించేడు. కానీ ఒక్క ముక్కా అర్థం కాలేదు.

సింహాచలంది శ్రీకాకుళం. ఓ కాంట్రాక్టరుమాటలు నమ్మి అయిదారేళ్ళ క్రితం భార్యతోసహా తెలంగాణా చేరేడు. ఇవ్వాల్సిన డబ్బు ఎగ్గొట్టి, ఆ కాంట్రాక్టర్ ఉడాయిస్తే, రోజుకూలీ చేసుకుంటూ గడుపుకొస్తున్నాడు.

"బాబా! మనం ఆపాలి, ఎర్రజండాలట్టుకు జులుస్‌ల పోయినప్పుడు నష్టం పెట్టిండ్రు కదా, అది బలే గున్న ఆపాలి, అమ్మ మల్లా ఒచ్చినాది జులుస్‌ల.. బాబా! బాబా!! అమ్మకి మల్లా కోడి బిర్యానీ అట్టుకుపోదామా?" తండ్రి తలమీద బాదుతూ హుషారుగా అడిగాడు రాములు.

"గట్లనే" అన్నాడు సింహాచలం.

"బాబా! మనం ఈ జులుస్‌ల పోకుండా లారీమీద అంబేద్‌కర్ బొమ్మకాడికి పోతే, కోడి బిరియానీ ఎట్టరా?" ఎండని తట్టుకోలేక అడిగాడు తండ్రిని.

"ఎట్టరు" సమాధానం ఇచ్చాడు సింహాచలం.

సింహాచలంకి కొడుకు ఆకలి అర్థమవుతోంది.

రాత్రి తిన్న చొప్ప సంకటి... ఉదయం నరగడువునే లారీ ఎక్కారు.

* * *

ఉదయం సూర్యుడు పొడవకముందే కాంట్రాక్టరు గుడిసె తలుపు కొట్టి చేతిలో యాభై నోటు కుక్కి 'హైదరాబాద్ ఛలో' అన్నాడు లారీ చూపిస్తూ.

"యాభయ్యేనా, రోజుకూలీ యాభైమీద ఇరవై కదా" అన్నాడు సింహాచలం.

"హైదరాబాద్‌ల కోడి బిరియానీ.. జులుస్ ఎవరిదో తెలుసా?.. జండాలట్టుకుని అరగంట నడక.. ఆ తర్వాత కోడి బిరియానీ.. సాయంత్రం సూర్యుడు గుంకముందే గూడెంలో దిగిపోతారు. ఏం తక్కువైంది?" కాంట్రాక్టర్ గదమాయించేడు.

కోడి బిరియానీ పేరు వినగానే, నిద్రలో వున్న రాములు లేచి కూర్చుని, తనని తీసుకువెళ్ళమని మారాం చేశాడు.

"రాములమ్మ ఏదీ" సింహాచలంని తోసుకుంటూ గుడిసెలోకి జొరబడ్డాడు కాంట్రాక్టరు. "ఒసేయి రాములమ్మా! నీకు యాభై నేదా? కోడి బిరియానీ నేదా?" గదమాయించేడు కాంట్రాక్టర్.

సింహాచలం భార్య రాములమ్మ నచ్చి బాలింతరాలు. బిడ్డకి పాలు పట్టడం ఆపేసి, చిరుగుల చీరకొంగుని, భుజాల మీదనుంచి, ఒళ్ళంతా కప్పుకుంటూ, కాంట్రాక్టర్ ఆకలి చూపులు తప్పించుకునే ప్రయత్నంలో, లేచి నిలుచుంది.

"ఛలో.." అన్నాడు కాంట్రాక్టరు రాములమ్మ మీద యాభైనోటు విసురుతూ.

నిస్సహాయంగా భర్తవైపు చూసింది రాములమ్మ.

సింహాచలం కాంట్రాక్టర్‌ని బతిమలాడుకున్నారు. "అది నచ్చి బాలింతరాలు. కూలికే ఇంకా ఎల్లడం లేదు.. ఎండకి బిడ్డ సచ్చిపోతాది..." అన్నాడు.

కాంట్రాక్టర్ కనికరించాడు. కళ్ళతో, చీర చిరుగుల్లోంచి రాములమ్మ సొగసుల్ని మరోసారి జుర్రుకున్నాడు. వెకిలిగా నవ్వుతూ విసిరిన యాభైనోటుని వంగి తీసుకుని, వెనక్కి తిరిగి మరో గుడిసెలోకి దొరబడ్డాడు. భర్తని కూడా జులుస్‌కి వెళ్ళొద్దని బతిమాలింది రాములమ్మ. వడదెబ్బ తగిలితే, పది రోజులు కూలీకి వెళ్ళలేనంది. నస్తులు పడాలంది. జులుస్‌లో వెళ్ళేవాళ్ళందరికీ కోడి బిరియానీ పెడితే దేశంలో కోళ్లే వుండవంది. కాంట్రాక్టర్ మాటలు నమ్మొద్దంది. కానీ సింహాచలం దృష్టంతా దిళమొలతో వెల్లకిలా పడుకుని వున్న రోజాల పసికందు మీద వుంది. పుట్టింది ఆడపిల్ల. దానికి ఓ రెండు అంగీలైనా కొనకపోతే చూసి వాళ్ళు ఏమనుకుంటారు.. హైదరాబాద్ కోఠీలో రంగురంగుల అంగీలు చాలా చవగ్గా ఇచ్చేస్తారని అందరూ చెప్తేరు. గూడెం నుంచి హైదరాబాద్‌కి బస్‌లో పోయి రావాలంటే యాభైపైగా ఖర్చవుతుంది. అదీకాకుండా ఓ రోజు కూలీ నష్టం.. కాంట్రాక్టర్ మాటలు వింటే, కూలీ కిడుతోంది, కూడూ కిడుతోంది. హైదరాబాద్ వెళ్లొచ్చే ఖర్చూ మిగులుతోంది.

కాంట్రాక్టర్ ఇచ్చిన యాభైని మొలలో దోపుకుని, కొడుకు రాముల్ని భుజాన వేసుకుని, లారీ ఎక్కాడు సింహాచలం.

రాములమ్మ నిస్సహాయంగా గుడిసె గుమ్మం దగ్గర నిలబడిపోయింది.

* * *

జులుస్ సాగుతోంది. ఎండ తీక్షణంగా పెరుగుతోంది. "బాబా! దాహం" అన్నాడు రాములు. నీడలో కూర్చుని, కూల్‌డ్రింక్స్ సిప్ చేస్తూ, సాగుతున్న ఊరేగింపుని చిరాగ్గా చూస్తున్న యువజంటల్ని చూస్తూ.

"సలివేంద్రం కాడ నీళ్ళు దొరుకుతాయి" అన్నాడు సింహాచలం అలాంటివాటికోసం కళ్ళతో చుట్టూ పరిశీలిస్తూ.

వంద గజాల దూరంలో వెదురు తడికలతో కట్టిన చలివేంద్రం కనిపించింది. అప్పటికే అందులోకి చాలామంది జనం. జొరబడిపోయారు. పైనుంచి మండుతున్న ఎండ, నెత్తి మాడ్చేస్తూ వుంటే, ఓవైపు ఆకలి, మరోవైపు పిడచబారిపోతున్న నాలుకలు.. ఎవ్వరూ పోలీసు లాఠీలకు భయపడి, చలివేంద్రం దగ్గర, సభ్య ప్రపంచక్యా కట్టుబాట్లు పాటించే పరిస్థితిలో లేరు. సింహాచలం కూడా కొడుకుని భుజంమీదనుంచి దించి ఆ దొమ్మీలోకి జొరబడ్డాడు. ఆ కుమ్ములాటలో, నీళ్ళు నిండబెట్టి వుంచిన కుండలు పగిలిపోయి, నీళ్ళంతా రోడ్డుపాలైనాయి. అంతా హతాశులయ్యారు. కొందరు తెలివైనవాళ్ళు రోడ్డుమీద పారుతున్న నీళ్ళలో తువ్వాళ్ళు తడిపి నెత్తిమీద కప్పుకుని సేదతీర్చుకున్నారు. మరికొందరు ఆ నీళ్ళల్లో నిలబడి మాడిపోతున్న పాదాల్ని క్షణంపాటు చల్లబర్చుకుని, జులుస్‌తోపాటు అడుగులు వెయ్యడం ప్రారంభించారు. హతాశుడైన సింహాచలం ఆ సందట్లో కొడుకుని వెదుక్కుంటూ వుంటే, రాములు రెండు చిట్టి చేతులతోను పగిలిన కుండపెంకుల్ని పట్టుకుని కనిపించాడు. "ఎందుకీ పెంకులు?" అన్నాడు సింహాచలం ప్రశ్నార్థకంగా.

"బాబా! జులుస్‌ల ఎల్లేటప్పుడు, బస్సుల మీద రాళ్ళెయ్యాల గదా, అందుకే ఇవి ఏరుకొచ్చినా!" అన్నాడు తండ్రివంక మెరుస్తున్న కళ్ళతో చూస్తూ.

"ఛీ.. అలాంటివేవీ కాంట్రాక్టర్ సెప్పలే.. పారేయ్!" అన్నాడు సింహాచలం పెంకుల్ని విసిరేస్తూ. రాములు చిన్నబుచ్చుకున్నాడు. ఇదివరకూ మరో పార్టీ జులుస్‌లో ఒచ్చినప్పుడు రాళ్లు విసిరి చాలా బస్సుల అద్దాలు పగలగొట్టారు. ఆ అనుభవం ఆ చిన్నారి

